రొళ్ల మండలంలో ఉపాధి ప నులు చేస్తున్న కూలీలు

పేరుకుపోయిన 'ఉపాధి' బిల్లులు

నాలుగువారాలుగా నిలిచిన చెల్లింపులు
ఇబ్బందుల్లో కూలీలు

ప్రజాశక్తి- రొళ్ల

ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. వ్యవసాయ పనులకు వెళితే ఏరోజుకారోజు కూలి చెల్లిస్తారు. దాంతో కూలీల రోజువారి జీవనం సాగుతుంది. పేద కూలీలకు ఏ రోజుకుఆరోజు వేతనాలు చెల్లింపు చేస్తే అదే రోజు సాయంత్రం ఇంటికి కావలసిన సరుకులను తీసుకుంటారు. ఎప్పటినుంచో రోజువారి కూలీల బతుకులు ఇలాగే సాగుతున్నాయి. గ్రామాల్లో పనులు లేని సమయంలో వారు పస్తులు ఉండాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కూలీలకు భరోసా కల్పించడానికి ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉపాధి పథకం కింద ఏడాదికి వందరోజులు పనులు కల్పిస్తోంది. సిపిఎం, వ్యకాసం పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని తెచ్చింది. అయితే ఈ పథకాన్ని కేంద్రం రాను రాను నీరుగార్చే యత్నం చేస్తోంది. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. రొళ్ల మండల వ్యాప్తంగా కూలీలకు సంబంధించి రూ. 10 లక్షలు బిల్లులు పెండింగ్ ఉన్నాయి. పనులు చేసి నాలుగు వారాలు దాటిన వారికి వేతనాలు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు. పనులు చేసే ప్రాంతంలోనూ ఇప్పటికీ ఉన్న సౌకర్యాలు కూడా నామ మాత్రాన అందిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ, టెంట్లు లాంటివి గతంలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఇవి ఎక్కడ కనిపించడం లేదు. కూలీలు తమ ఇళ్ల నుంచి బాటిళ్లలో తాగునీరు తీసుకుని వెళుతున్నారు. అవి ఎండకు వేడెక్కుతున్నాయి. వాటినే కూలీలు తాగుతున్నారు. మండుటెండల్లో కాసేపు విశ్రాంతి తీసుకోవాలన్న సరైన టెంట్లు లేక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. చెట్లు ఉంటే సరి లేకుంటే ఎండలోనే ఉంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి రావలసిన వేతనాలు చెల్లించి కూలీలకు సరిపడే సౌకర్యాలను కల్పించి కూలీలను ప్రోత్సహించాలని కూలీలు కోరుతున్నారు.

వామ్మో.. జూన్

పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. 11 నెలల పాటు ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చిన పేద, మధ్యతరగతి కుటుంబాలు జూన్‌నెల వచ్చిందంటేనే భయపడిపోతున్నారు. అమ్మో.. జూన్ అంటూ నోరెళ్లబెడుతున్నారు. నెలరోజులపాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలపై కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా, వారి తల్లిదండ్రులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఆలోచన చేస్తున్నారు.

ఆ నెల వస్తేనే పేద, మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు
కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్ల దోపిడీ.. డొనేషన్ల వాత
విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి-హిందూపురం

జూన్ నెల వచ్చిందంటే సామాన్యులకు దడ మొదలైనట్లే. స్కూళ్ల ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇతర సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. వీటిపై నియంత్రణ అనేది లేకపోవడంతో ఈసారి స్పెషల్ ఎఫెక్ట్ అన్నట్లు ఫీజుల భారం రెట్టింపు అయింది. పనిలోపనిగా వైసీపీ సర్కారు సామాన్యులకు షాకుల మీద షాకులిస్తోంది. ఈ నెలలోనే అన్నింటినీ పెంచేసింది. కరెంటు బిల్లులను పెంచేసి త్రిబుల్ భారం వేసింది. అటు ఆస్తిపన్ను పెంపుతో పాటు ఇటు ఇంటి అద్దెలు పెరిగాయి. ఆపై నిత్యావసర ధరల పెరుగుదల, ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒక్కో కుటుంబానికి ఈ నెలలో సుమారు లక్షలకుపైనే ఖర్చు వచ్చిపడటంతో చాలీచాలని వేతనాలతో, పైసాపైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈనెల గడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలలు పున : ప్రారంభం కావడంతో ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు దోపిడీ పర్వానికి తెరతీశాయి. పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కుల ధరలను పెంచి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని నిబంధనలు చెప్తున్నా బేఖాతరు చేస్తున్నాయి. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రయివేటు యాజమాన్యాలు అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు వసూళ్లు చేస్తున్న సొమ్ము భారీగా ఉండడంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు నలిగిపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,053 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు దాదాపు 1995, ప్రాథమికోన్నత పాఠశాలలు 469, ఉన్నత పాఠశాలలు 589 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 2,655 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 1916, ప్రాథమికోన్నత 332, ఉన్నత పాఠశాలలు 407 ఉన్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలలు దాదాపు 450కు పైగా ఉన్నాయి. వీటితో పాటు ప్రయివేటు అన్‌ఎయిడెడ్, సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న ప్రయివేటు అన్ ఎయిడెడ్ 15 ఉన్నాయి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో కలిపి దాదాపు 3,90,859 విద్యార్థులు చదువుతున్నారు.

భారీగా డొనేషన్లు

ఎండల ప్రభావం కారణంగా వారంరోజుల పాటు ఒంటిపూట బడులు పెట్టినా ఆ తర్వాత పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటి ప్రచారానికి తెరలేపాయి. తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఆకర్షణీయంగా కరపత్రాలు పంచుతూ టోక్నో...ఈ టెక్నోల పేరుతో క్యాంపెయిన్ ముమ్మరం చేశాయి. ఇదిలా ఉంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలనే ఆలోచనలో పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు దగ్గరి పట్టణాల్లోని స్కూళ్లను ఎంచుకునే ప్రయత్నంలో నిమగ్నం కాగా, అక్కడ డొనేషన్లు, ఫీజుల మోత విని భయపడుతున్నారు. యూకేజీ, ఎల్‌కేజీ స్థాయిలోనే వేలాది రూపాయల ఫీజులతో పాటు అధికమొత్తంలో డొనేషన్లు చెబుతుండటంతో వెనక్కి తగ్గుతున్న పరిస్థితి ఏర్పడింది.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకు మోతే

పాఠశాలలు పున్ణప్రారంభం అవుతున్నాయంటే తల్లిదండ్రులకు గుర్తుచ్చేది ఫీజులు, పుస్తకాలే. ముఖ్యంగా స్కూలులో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్‌బుక్కులతోపాటు, వాటిని భద్రపరుచుకునేందుకు భారీ బ్యాగులు, దానికి తోడు లంచ్ బాక్స్, పెన్ను, పెన్సిల్. ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువుల కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులు కావాల్సిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన దుకాణంలో కొనుక్కునేవారు. అయితే ఇపుడు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల పంథా మారింది.పుస్తకాలు, బెల్టు, టై, యూనిఫాం అన్నీ ఆయా పాఠశాల్లోనే కొనాల్సిన పరిస్థితి. దీంతో పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన ధర చెల్లించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఒకవైపు ఆర్థికభారం, మరోవైపు పిల్లాడి భవిష్యత్ దీంతో మౌనంగానే ముందడుగు వేస్తున్నారు. అడ్మిషన్ నుంచి తరగతి గదిలో అడుగు పెట్టేంత వరకు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైపోతోందని చెప్పవచ్చు.

ఒక్కో కుటుంబంపై లక్షలాది రూపాయల భారం

ఒకవైపు నిత్యావసర సరుకులు, వివిధ ఖర్చులు అడ్డగోలుగా పెరిగిపోయాయి. దీంతో ఏ నెలకానెల ఆదాయ, వ్యయాలపై ఆచితూచి అడుగులు వేస్తున్న వారిలో వేతనజీవులు, చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు ఉన్నారు. అయితే విద్య విషయంలో పెరిగిన అవగాహన నేపథ్యంలో అందరూ పిల్లలను ఉన్నతంగా చదివించాలనే తలంపుతో ఉన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ రోజుల్లోనే పట్టణంలోని ఒక చిన్న కుటుంబం ఇంటి అవసరాలకు రూ.25 నుంచి రూ.30వేల వరకు ఖర్చవుతుండగా, ఈ నెలలో ఇంటి అవసరాలు పక్కనపెడితే కేవలం పిల్లల స్కూలు కోసం ఒక్కొక్కరికీ రూ.50వేల వరకు ఖర్చుచేయాల్సి వస్తుంది. అయితే ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఇక అంతే. జూన్‌లో లక్ష రూపాయలకు పైనే ఖర్చు అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇకపోతే పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లలో అంతకు రెట్టింపు ఆందోళన ఉంది. ఇంటర్ ఏ కాలేజిలో చేర్చాలి, డే స్కాలర్‌నా, హాస్టల్లోనా అనే ఆలోచనలు మెదలుతుంటాయి. దీంతోపాటు ఆయా కాలేజీల గుర్తింపును బట్టి విద్యార్థికి అక్షరాల లక్షరూపాయలపైనే ఖర్చవుతోంది. మరోవైపు ఈనెలలోనే సర్కారు మూడు రెట్లు కరెంటు బిల్లుల మోత మోగించడంతో సామన్యుడి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంకోవైపు నిత్యావసర సరకుల ధరలు, కూరగాయల ధరల పెరుగుదలతో జూన్ మాసం, పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఓ వణుకు పుట్టిస్తోంది.

ప్రయివేటు విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు దాసోహం

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ దాసోహమైంది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇప్పటికే ఫీజులకు, పుస్తకాల అమ్మకాలపై ఆందోళన కార్యక్రమం నిర్వహించాం. అయినప్పటికి విద్యాశాఖ అధికారులు డబ్బుకు అమ్ముడుపోయి పట్టించుకోవడం లేదు. పాఠశాలలు తెరవగానే ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు అడ్డగోలుగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అధిక ధరలకు అమ్ముతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఎటువంటి అమ్మకాలు చేపట్టకూడదు. అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

బాబావలి
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు

ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులపై పిల్లల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఫలానా స్కూల్‌లో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని లిఖితపూర్వకంగా రాసిస్తే చర్యలు చేపడతాం. ఫీజుల వివరాలకు సంబంధించి స్కూళ్లలో తప్పనిసరిగా బోర్డులు ప్రదర్శించాలి. పాఠశాల్లో పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం నిబంధనలకు విరుద్ధం.

రంగస్వామి
ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి

ఎంజిఎం పాఠశాల హెచ్‌ఎం సస్పెండ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం ఎంజిఎం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డిఆర్ఆర్ సామ్రాజ్యంను సస్పెండ్ చేస్తు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎంజిఎం పాఠశాల హెచ్‌ఎంగా సామ్రాజ్యం విధులు నిర్వహిస్తున్న సమయంలో అడ్మిషన్ చేసుకోవాలన్న, పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులకు టిసిలు ఇవ్వాలన్న రూ.100 నుంచి 500 రూపాయల వరకు విద్యార్థుల తల్లిదండ్రున నుంచి వసూలు చేసింది. దీంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగ వ్యవహరించింది. ఈ విషయాలను ప్రజాశక్తి ఆ సమయంలో ప్రత్యేక కథనం రూపంలో వెలుగులోకి తీసుకు వచ్చింది. దీంతో పాటు కొంత మంది లోకాయుక్తను ఆశ్రయించారు. స్పందించిన వారు విచారణ చేయాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. దీంతో ఆ సమయంలో పెనుకొండ డిప్యూటీ డిఇఒ రంగస్వామిని విచారణ అధికారిగా నియమించారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సమగ్రంగా విచారణ చేసి, నివేదికను ఆయన అధికారులకు అందజేశారు. అన్ని విధాల విచారణ చేసిన అధికారులు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా హెచ్‌ఎం సామ్రాజ్యంను సస్పెండ్ చేయడమే కాకుండా విచారణ పూర్తి అయ్యే వరకు జిల్లా వదలి వెళ్లరాదని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

నారాయణ పాఠశాల సీజ్

ప్రజాశక్తి - కొత్తచెరువు

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కొత్త చెరువులోని నారాయణ పాఠశాలను ఎంఇఒ వెంకటరమణనాయక్ గురువారం సీజ్ చేశారు. డిఇఒ ఆదేశాల మేరకు ఎంఇఒ పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. గుర్తింపు లేనందున ఆ పాఠశాలను సీజ్ చేశారు. ఆపాఠశాలలో పదవ తరగతి వరకు అడ్మిషన్లు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలడంతో పాఠశాలను సీజ్ చేశారు. ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చేంతవరకు తరగతులు నిర్వహించకూడదని దేశాలు జారీ చేశారు. పాఠశాలను సీజ్ చేసిన కాపీని ప్రిన్సిపల్ గురు ప్రసాద్ కు ఎంఇఒ అందజేశారు.

నారాయణ పాఠశాలను సీజ్ చేస్తున్న అధికారులు

వైసిపి ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టడానికే బస్సుయాత్ర

మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వ అరాచకాలు అక్రమాలు అన్యాయాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ముఖ్య ఉద్దేశంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బస్సు యాత్ర చేపడుతున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పల్లె విలేకరులతో మాట్లాడుతూ 24న శనివారం భవిష్యత్తు గ్యారెంటీ బస్సుయాత్ర పుట్టపర్తి నియోజకవర్గంలోని బొగ్గలపల్లి నుంచి ప్రారంభమవుతుందన్నారు. అక్కడ నుంచి నల్లమాడ, వెంగళమ్మ చెరువు, పుట్టపర్తి మీదుగా బుక్కపట్నం నుంచి కొత్తచెరువుకు బస్సు యాత్ర చేరుకుంటుందన్నారు. అక్కడ బహిరంగ సభ సాయంత్రం ఉంటుందన్నారు. శనివారం రాత్రి పుట్టపర్తి లో బస చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. నల్లమాడ లో టిడిపి హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఈ యాత్రలో ప్రజలకు వివరిస్తామన్నారు. పుట్టపర్తి సమీపంలోని కర్నాటక నాగపల్లి వద్ద టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిట్కో ఇళ్లను చంద్రబాబు పరిశీలిస్తారన్నారు. అలాగే మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు ఈ యాత్రలో వివరిస్తారన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 15 వేలు పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్న ఒక్కొక్కరికి ఏడాదికి చదువుకు రూ. 15 వేలు, ఇంటింటికి కులాయిలు, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, బిసిల రక్షణ చట్టం తదితర పథకాలన్నీ ఈ యాత్రలో వివరించడం జరుగుతుందన్నారు. ఈ బస్సు యాత్రలో టిడిపి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

వేతనాల కోసం స్వచ్ఛ భారత్ కార్మికుల భిక్షాటన

భిక్షాటన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి:- చిలమత్తూరు

స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ కార్మిక సంఘం, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిరంతరం ప్రజ ఆరోగ్యాన్ని కాపాడుతూ సేవలు అందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు దాదాపు 9 నెలలు నుండి 18 నెలలు దాకా వేతనాలు అందలేదన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి కుటుంబాల పోషణ చేసుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తూ కార్మికులను రోడ్డుపాలు చేసిందని విమర్శించారు. తక్షణమే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా భిక్షాటన చేయగా వచ్చిన నగదుతో కార్మికులకు సోపు, నూనె కొనుగోలు చేసి సిఐటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్, లక్ష్మీనారాయణ, రామచంద్ర, గంగాధర్ , ఆటో బాబా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, స్వచ్ఛభారత్ కార్మికులు ఆదినారాయణ, నరసింహప్ప, ఆదిమూర్తి, గంగమ్మ, నారాయణక్క, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజా సమస్యలు గుర్తించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. శనివారం 24వ తేదీ నుంచి నెలరోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం పై అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులు షెడ్యూల్ గురించి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ముందుగానే గృహసారథులు వాలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ పథకాలు, సమస్యలు ప్రజల నుంచి తెలుసుకొని వాటిని సేకరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు ప్రతి సచివాలయంలో ఒకరోజు ఉండి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడంతో పాటు అవసరమైన పత్రాలు జారీ చేయాలన్నారు. ప్రజలు తమ సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమం నుంచి పరిష్కరించుకోవచ్చన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. జులై 1 నుంచి ఆగస్టు 1 వరకు ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో క్యాంపులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. కుల, నివాస, ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ, సర్టిఫికెట్లు, రేషన్ కార్డుల విభజన తదితర సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. అనంతరం వైఎస్ఆర్ పశు బీమా పథకానికి సంబందించిన గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ విజయ్ కుమార్, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, సర్వే ల్యాండ్స్ ఏడీ రామకృష్ణ, పశు సంవర్ధక శాఖ జెడి శుభదాస్, ద్వామా పీడీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆటోనగర్‌లో చేపట్టిన మురుగు కాలువల పనులను త్వరతగితిన పూర్తి చేయాలని గుత్తేదారుడు రంగనాథ్‌ను కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం ఆ వార్డు కౌన్సిలర్‌తో కలిసి ఆటోనగర్‌లో పర్యటించారు. ఆదే విధంగా అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి పనులను త్వరగ పూర్తి చేయించాలని ఇంజనీర్లకు ఆదేశించారు. అనంతరం అదే ప్రాంతంలో ఉన్నా చెత్త తరలింపు స్టేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు పాల్గొన్నారు.

అర్హులందరితో ఓటరుగా పేరు నమోదు చేయించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా 18 సంవత్సరాలు నిండిన అందరితో ఓటరుగా పేరు నమోదు చేయించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో తహశీల్దార్ హసీనా సుల్తానతో కలిసి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఎన్నికల బూత్ స్థాయి అధికారులు, సుపర్‌వైజర్‌లకు ఈ విషయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 2024 ఎన్నికల నేపథ్యంలో భాగంగా పురపాలక సంఘ వ్యాప్తంగా జూలై 2వ తేదీ నుంచి ఇంటింటా సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరితో ఓటరుగా పేరు నమోదు చేయించాలన్నారు. దీంతో పాటు ఓటరు కార్డులో ఎవైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దడంతో పాటు చనిపోయిన వాటిని తొలగించాలన్నారు. ఓటర్ల వివరాలను బిఎల్ఒ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ విధుల్లో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ శిక్షణలో ప్రత్యేక అధికారి రమేష్, ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ విద్య : ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కేజీ నుండి పీజీ వరకూ కార్పొరేట్‌కు దీటుగా పేద విద్యార్థులకు జగనన్న ప్రభుత్వం ఉచిత విద్యనందిస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి రాగానే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసిందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ఏటా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో జంగా అదితి కర్(586), బాలం సాయిప్రసాద్(586), మదన మురళి (586)లకు రూ.15 వేల చొప్పున, కడవల కృష్ణతులసి (585) రూ. 10వేలు, తాడిపత్రి ముబాశిర(584) రూ. 5వేలు అందజేశారు. ఇంటర్ విద్యార్థులు నీరుగంటి అనా(971), సాకే ఓంకార్(698), గుజ్జల మౌనిక(902), పందెం హర్షిక (372)లకు రూ. 15వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను,

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

కళాశాల ప్రిన్సిపల్, హెచ్‌ఎంలను ఎమ్మెల్యే దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, తహశీల్దార్ యుగేశ్వరి, వైస్ చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, ఎంఈఓలు సుధాకర్‌నాయక్, గోపాల్ నాయక్, కౌన్సిలర్లు షంషాద్ బేగం, వేముల జయరామి రెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, కడప రంగస్వామి, గజ్జల శివ, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ రెడ్డి, హెచ్‌ఎం మేరీ వరకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'నాసిన్'తో విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

కేంద్ర మంత్రి దేవాన్ష్ చౌహాన్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

నాసిన్ కంపెనీ పనులు పూర్తయితే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని కేంద్ర మంత్రి దేవాన్ష్ చౌహాన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పాలసముద్రం వద్ద ఏర్పాటు చేస్తున్న నాసిన్ కంపెనీని గురువారం ఆయన జిల్లా అధికారులతో కలిసి సందర్శించారు. అలాగే కంపెనీకి సంబంధించిన ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నిర్మాణ దశలో ఉన్న పనులు, పనితీరు గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కంపెనీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నాసిన్ కంపెనీ పూర్తయితే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇలాంటి కంపెనీలు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమని, నాసిన్ కంపెనీ దేశానికే వెన్నెముక లాంటిదని తెలిపారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీఓ భాగ్యరేఖ, తహశీల్దార్లు రంగనాయకులు, సురేష్, కంపెనీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నాసిన్ కంపెనీ మ్యాప్ ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి చౌహాన్

రేషన్ సక్రమంగా అందించండి

లేపాక్షి: చౌకదుకాణాల్లో కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని కేంద్ర సహాయ మంత్రి దేవాన్ష్ సింహ చౌహాన్ ఆదేశించారు. స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను సక్రమంగా అందజేయాల న్నారు. చౌకడిపోల్లో రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు తక్కువ వడ్డీకే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు బిజెపి బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలని సిడిపిఒ సరస్వతి ఆదేశించారు. స్థానిక ఎంపిడి ఒ కార్యాలయంలో గురువారం తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సమయపాలన పాటించాలన్నారు. చిన్నారులను ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు సరైన సలహాలు, సూచనలు అందివ్వాలన్నారు. అన్ని వయస్సుల పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేయించాల న్నారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, న్యూట్రిషియన్ ఛార్టులు, టైమ్ టేబుల్ ప్రద ర్శించాలన్నారు. పాలు, గుడ్లు, బాలామృతం, వైఎస్ఆర్ కిట్లు అందివ్వాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లులకు తగిన సూచనలు చేయాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు చంద్ర మ్మ, దేవమణి, లలితమ్మ, సీనియర్ అసిస్టెంట్ శంకరమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ సరస్వతి

బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్లు

తలుపుల : మండల నూతన తహశీల్దార్‌గా గురువారం శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఓబుళదేవర చెరువు మండలం నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కార మే ధ్యేయంగా పని చేస్తానన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని సూచించా రు. నూతన తహశీల్దార్‌కు ఇన్‌ఛార్జి తహశీల్దార్ మునిస్వామి, ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

తహశీల్దార్ శ్రీధర్

అమరాపురం: మండల తహశీల్దార్‌గా గురువారం రమేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఉరవకొండలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న ఈయన పదోన్నతిపై తహశీల్దార్‌గా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ ప్రతినిత్యం ప్రజా సేవ చేస్తానని తెలిపారు.

తహశీల్దార్ రమేష్‌బాబు

గాండ్లపెంట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఎస్‌కె హమీద్‌బాషా బాధ్యత లు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లా ఐరాల మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజల కు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ హమీద్‌బాషా

సిఎం జగన్ ప్రసంగాన్ని వీక్షించాలి

రొద్దం : సీఎం జగన్ శుక్రవారం(నేడు) లాంఛనంగా ప్రారంభిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, జడ్పీటీసీ పద్మ అక్కులప్ప, సర్పంచి, ఎంపిటిసిలు, మండల నాయకులను ఆహ్వానించినట్లు ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ తెలపారు. మండల పరిధిలోని సచివాలయాల సిబ్బంది 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ఆయా సచివాలయాల్లో ఏర్పాట్లు చేసి మీ గ్రామ పరిధిలోని సర్పంచిలు, వార్డు మెంబర్లు, వాలంటీర్లు, ఎంపీటీసీలు, గృహ సారథులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి విజయవంతం చేయాలని సూచించారు.

తండాలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఒడ్డుకింద తండాలో ఆర్‌డిటి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ఆర్‌డిటి రీజియన్ డైరెక్టర్ ప్రమీలకుమారి ప్రారంభించారు. ఒడ్డుకింద తండా వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు ఆర్డిటి సహకారం తో 'స్వరాజ్య నిధి' ద్వారా రూ. 7 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం తో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎటిఎల్ సంజీవరెడ్డి, టీం సభ్యులు, తండా ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

రొద్దం : మండల పరిధిలోని కొగిర అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సిడిపిఒ శాంతలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్‌లో విద్యతో పాటు ఆటల పోటీలు సక్రమంగా నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అలాగే మహిళలు, పిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చట్టాలు తీసుకొచ్చిందని, కావున పిల్లలు, మహిళలపై అఘాత్యాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల రైతులు చిన్న, సన్నకారు రైతులు వారం లోపు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఎపిడి జయసింహ సూచించా రు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావే శం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎపిడి మాట్లాడుతూ పూలతోటల పెంపకంలో భాగంగా రోజ్ గార్డెన్, మల్లెపూల తోటలు సాగు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తు న్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎపిఒ ఓబుళప్ప, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

కొత్తచెరువు : వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి తనయుడు ఇంద్రజిత్తురెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బైరాపురం, ఎర్రబల్లి గ్రామాల్లో గురువారం సాయంకాలం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని సూచించారు. గ్రామాల్లో వర్గ విభేదాలు వీడి ఐకమత్యంగా ఉండి ఎన్నికల్లో పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజెప్పాలని సూచించారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులందరకీ అందుతున్నాయన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

లేపాక్షి : స్థానిక వివేకానంద జడ్పీ హైస్కూల్‌లో గురువారం హెచ్‌ఎం భారతి అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రు లు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రణవి(513), జశ్వంత్‌రెడ్డి(490), అలౌకిక(465)లకు నగదు, మెడ ల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఈరన్న పరామర్శ

మడకశిర : నియోజకవర్గం పరిధిలోని జిల్లడగుంట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రామచంద్రగౌడ్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసి గురువారం మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆ గ్రామం వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిం చి ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకు లు ఆదినారాయణ, ప్రకాష్, రామాంజనేయులు, కృష్టప్ప, మంజునాథ్, నరేష్, రామంజప్ప, నాగప్ప, తదితరులు ఉన్నారు.

టిడిపి నాయకుడు మృతికి 'పల్లె' నివాళి

బుక్కపట్నం : మండల పరిధిలోని చంద్రాయునిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు దేవా మృతి చెందడంతో గురువారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లె ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-పెనుకొండ

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ మాట్లా డుతూ పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుం డా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరే ట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాఠ్యపుస్తకాలు, యూనిఫా మ్, నోట్ బుక్కులు, టైలు, ఇతర సామగ్రి పాఠశాలలోనే కొనాలి అనే నిబంధన పెట్టి డబ్బులు దండుకుంటున్నారన్నారని పేర్కొన్నా రు. ముఖ్యంగా స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని, ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, భగత్, వినోద్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డిఎంహెచ్‌ఒ ఎస్‌వి. కృష్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్: మాతా శిశు సంరక్షణ, అనీమియా, సీజనల్ వ్యాధులు పట్ల అప్రమ త్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. ఆయన గురువారం మండ ల పరిధిలోని పెడపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలోని వైద్య సిబ్బంది మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందించే సేవలు, టీకాలు, రక్తహీనత, సంజీవని, తదితర సేవలపై సలహాలు ఇచ్చారు. అనం తరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పిల్లల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత గురించి విచారించారు. వ్యాయామం చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి శారీర కంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ముఖ్యంగా ప్రతి ఫ్రై డేని డ్రైడేగా పాటించాలన్నారు. పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.నాగరాజు నాయక్, సామజిక ఆరోగ్య కార్యకర్త నగేష్, సూపర్‌వైజర్లు చంద్రకళ, సరస్వతమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రాధ, ఆరోగ్య కార్యకర్తలు శివ, సుస్మిత, ఆశా కార్యకర్త పద్మావతి, ఉపాధ్యాయులు భగవంతప్ప, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త భగవతి, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వ్యాప్తంగా ఇష్టారాజ్యాంగా ఎవరి అనుమతి లేకుండా పట్టపగలే చెరువు మట్టి తరలిస్తున్నా పట్టించుకునే వారే లేరు. మండల పరిధిలోని చెరువులో ఏకంగా జెసిబిలు, ట్రాక్ట ర్లు పెట్టి మట్టిని తరలిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండల వ్యాప్తంగా పలువులు వ్యాపారులు, ఇటుకల బట్టీల యజమానులు, జెసిబిలతో చెరువు మట్టిని తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో కొందరు రైతులు వ్యవసాయ భూములకు మట్టి తరలిస్తుండగా ఇరిగేషన్ అధికారులు ఏకంగా కేసులే నమోదు చేయించారు. దీంతో రైతులకు ఒక న్యాయం.. వ్యాపారు లకు ఒక న్యాయమా.. అని ప్రజల ప్రశ్నిస్తున్నారు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో ఇలాంటి చర్యలను సమర్థిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ట్రాక్టర్‌లో తరలిపోతున్న మట్టి

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం లో గురువారం మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2,379 గృహాలు మంజూరయ్యాయ న్నారు. ఇప్పటి వరకూ 695 గృహాలు పురోగతి సాధించాయని, ఇలా అయితే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమ న్నారు. లబ్ధిదారుల దగ్గరికి వెళ్లి ఇల్లు కట్టుకునే విధంగా వారికి అవగాహన కల్పించి నిర్మాణా లు మొదలుపెట్టేలా చూడాలన్నారు. ప్రభుత్వం అడ్వాన్స్ బిల్లులు చెల్లిస్తుందని గృహ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ సిద్ధారెడ్డి, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పద్మావతి పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శివ రంగ ప్రసాద్

సమర్థనం ట్రస్ట్‌కు రోడ్డు వేయిస్తా

ప్రజాశక్తి-చిలమత్తూరు

సమర్థనం ట్రస్ట్‌కు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని కోడూరు గ్రామపంచాయతీ సర్పంచి మురళీ పేర్కొన్నారు. కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సమర్థనం ట్రస్ట్‌లో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులను గుర్తించి ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. ఇప్పటి వరకు దాదాపు 34 బ్యాచ్‌ల విద్యార్థులు ఉచితంగా శిక్షణ పొందారని కొనియాడారు. ఒరాకిల్ కంపెనీ సహకారంతో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం హర్షించదగ్గ విశయమన్నారు. తమ పంచాయతీ లో ఇలాంటి ట్రస్ట్ ఉండటం చాలా సంతోషంగా ఉందని, హైవే రోడ్డు నుంచి ట్రస్ట్ వరకూ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమర్థం ట్రస్టీ సభ్యులు శంకర్, మధు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి 'చైతన్య యాత్ర'కు ఏర్పాట్లు

కదిరి టౌన్ : 'భవిష్యత్తుకు గ్యారెంటీ' ప్రచార కార్యక్రమంలో భాగంగా టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి కందికంట వెంకటప్రసాద్ నేటి (శుక్రవారం) నుంచి 'చైతన్య యాత్ర'(బస్సు యాత్ర) చేపట్టనున్నారు. ముందుగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజ లు నిర్వహించి అక్కడి నుంచే యాత్రను ప్రారంభిస్తారు. ఈ యాత్ర మక్కా ఆలం ఖాన్ వలి దర్గా, రాయలసీమ సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా వేమారెడ్డి సర్కిల్ చేరుకుని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో మాట్లాడతారు. అనంతరం పట్టణంలోని వివిధ సర్కిళ్ల మీదుగా యాత్ర చేపడతారు.

మడకశిర : ఈ నెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న 'భవిష్యత్తుకు గ్యారెంటీ' చైతన్యయాత్ర రూట్ మ్యాప్‌పై గురువారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి పార్టీ శ్రేణులతో చర్చించారు. అలాగే బస్సుయాత్ర రూట్‌ను పరిశీలిం చారు. ఈ యాత్ర మొదట కల్లుమర్రి గ్రామంలోకి ప్రవేశించి అనంతరం బుల్లసముద్రం మీదుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు మనోహర్, కళ్ళు మరీ సర్పంచ్ గంగమ్మ నాగరాజ్, పట్టణ కార్యదర్శి పుల్లయ్య చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్, తిమ్మరాజు, ఉమా శంకర్, ఐ టి డి పి తాలూకా అధ్యక్షుడు కాంతరాజు, సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథ్ రెడ్డి

కొత్తచెరువు: పుట్టపర్తి నియోజకవర్గంలో ఈ నెల 24వ తేదీ చేపట్టనున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవిద్య కళాశాలలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ యాత్రలో మినీ మేనిఫెస్టోతో పాటు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామ న్నారు. 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కొత్త చెరువులో బహిరంగ సభ ఉంటుందని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, వెంకటరమణ, నాగేంద్ర ప్రసాద్, బా బా, రాజు, కిష్టప్ప రమేష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సుధాకర్, వంశీకిషోర్, తదితరులు పాల్గొన్నారు

ఓబుళదేవరచెరువు: టిడిపి బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ జయచంద్ర సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరు ల సమావేశంలో మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నల్లమాడ మండలంలోని బుగ్గలపల్లి నుంచి కొత్తచెరువు వరకు బస్సు యాత్ర చేపడతారన్నారు. ఆ యాత్రలో ఒడిసి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గుడిబండ: ఈ నెల 26వ తేదీ చేపట్టనున్న 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. గుడిబండలో గురువారం ఆ పార్టీ సీనియర్ న్యాయవాది శివకుమార్ ఇంటి ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ టిడిపి మినీ మేనిఫెస్టోతో పాటు వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప న్యాయవాది శివకుమార్, దుర్గేష్, మంజునాథ్, రవిస్వామి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి జయరాం, నాగరాజు, నాగభూషణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు రూట్‌ను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి, తదితరులు

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

అమరాపురం : ట్రాక్టర్‌తో పొలం దుక్కి చేస్తుండగా రోటోవేటర్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం మండల పరిధిలోని హేమావతి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ట్రాక్టర్ డ్రైవర్ సిద్దలింగప్ప(25) హేమావతి గ్రామానికి చెందిన రైతు డ్రైవర్ యంజరప్ప పొలంలో దుక్కి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ రోటోవేటర్ కిందపడి మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్ట్

అమరాపురం : మండల పరిధిలోని చిట్నడుగు గ్రామ శివారులో పేకాట ఆడుతన్న ఆరుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 5 సెల్‌ఫోన్లు, 7 ద్వి చక్రవాహనాలు, రూ. 50,100 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కేసు నమోదు చేసుకొని మడకశిర సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

చెరువు రక్షణ కంచె స్తంభాలు చోరీ

సోమందేపల్లి: మండల పరిధిలోని రంగేపల్లి చెరువు కట్టమీద వాహనాలు కిందకు పడిపోకుండా ఏర్పాటు చేసిన రక్షణ కంచెకు ఉన్న ఇనుప దిమ్మెలను దొంగలు రాత్రికి రాత్రే ఎత్తుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి చెరువుకట్టపై కంచె బోల్టులు తీసేసి రెండు ఇనుప దిమ్మెలను ఎత్తుకెళ్లారు. ఇటీవల అధికారులు చెరువు కట్టపై నూతనంగా తారు రోడ్డు వేసి ప్రజల సౌకర్యార్థం కంచె ఏర్పాటు చేశారు. అయితే కొందరు స్వార్థపరులు వాటిని ఎత్తుకెళ్లడంతో ప్రజలు మండిపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించండి

ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి బత్తలపల్లి

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు అర్థవంతంగా వివరిస్తూ టిడిపి వైపు ఆకర్షితులయ్యేలా చూడాల్సిన బాధ్యత సెక్షన్ ఇన్‌ఛార్జిపై ఉందని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. స్థానిక గుండా కల్యాణ మండపంలో గురువా రం నిర్వహించిన సమావేశంలో శ్రీరామ్ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టో మహిళలు, యువకులు, శ్రామికులు, రైతులకు ఉపయోగకరంగా ఉందన్నా రు. తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాల్లో టిడిపి అధికారంలోకి రాగానే ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయిస్తామన్నారు. భయపడకుండా ధైర్యంగా పార్టీ కోసం కష్టించే పని చేయాలని కోరారు. అంతకుముందు రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్ చౌదరి, జక్కంపూడి నాగభూషణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్ నాయుడు, తదితరులు క్లస్టర్ ఇన్‌ఛార్జిలు చేయాల్సిన విధులు, పార్టీ బలోపేతర, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, సుబ్బరాయుడు, సురేంద్ర నాయుడు, నెట్టెం రమణ, జక్కంపూడి నాగభూషణ, గంటాపురం జగ్గు, అయ్యప్ప, బాలాంజనేయులు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రవి, ముళ్లగూరు సతీష్, రామాపురం కేశవ, సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, డేరంగుల ప్రతాప్, ఎం.చెర్లోపల్లి చౌదరి, ముష్టూరు రామాంజనేయులు, నాగార్జునరెడ్డి, అప్పస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ఆవుకు శస్త్రచికిత్స

ప్రజాశక్తి-బత్తలపల్లి

క్యాన్సర్ వ్యాధి సోకి కన్ను దెబ్బతిన్న ఆవుకు గురువారం బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాలలో వైద్యులు శస్త్రచికిత్స చేసి కన్ను తొలగించారు. దీనికి సంబంధించి ఎడి శ్రీనివాసులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని నల్లబోయనపల్లి గ్రామానికి చెందిన రైతు భరత్ ఆవు విషయాన్ని తెలపడంతో అంబులెన్స్ ఆ గ్రామానికి వెళ్లి ఆవును ఇక్కడికి తీసుకొచ్చారు. పశువైద్యురాలు దివ్య, కాంపౌండర్ సాయినాథ్ సహకారంతో ఆవు కన్నుకు శస్త్రచికిత్స అవసరమైన మందులు వేశారు. మరో ఐదు రోజుల పాటు ఆవును జాగ్రత్తగా చూసుకోవాలని రైతుకు సూచించారు. ఆవును అంబులెన్స్‌లోనే స్వగ్రామానికి తరలించారు. పశువులు అనారోగ్యానికి గురైతే అంబులెన్స్‌కు ఫోన్ చేసి వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు.

ఆవు కంటికి శస్త్ర చికిత్సలు చేస్తున్న వైద్యులు

మితిమీరిన వైసిపి అరాచకాలు

రొళ్ల : వైసిపి అరాచకాలు తాలిబన్లను మించిపోయాయని టిడిపి రాష్ట్ర ఒక్కలిగ సాధికార సమితి కన్వీనర్ పాండు రంగప్ప విమర్శించారు. మండల పరిధిలోని వన్నారన్నపల్లిలో గురువారం టిడిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో బిసిలకు అడుగడుగునా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 26 మందిని హత్య చేశారని, వందలాది మందిపై తప్పుడు కేసులు పెట్టి వేలాదిమందిపై దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా అణగదొక్కే కుట్ర జరుగుతుందన్నారు.